## క్లుప్తంగా

### నాడు- నేడు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ఇండస్ట్రియల్‌కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు – నేడు పనులను సోమవారం వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఆడుకోవడానికి క్రీడాపరికరాలతో పాటు పరిశుభ్రమైన మరుగుదొడ్లు, ఆర్‌వో వాటర్ సౌకర్యం కల్పిస్తామన్నారు.పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు ఆమె ఆదేశాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు జీవీఎస్ఎన్.రాజు ( కేబుల్ వాసు),కొల్లి నూకరెడ్డి,బూస అప్పలరెడ్డి, నూకరాజుయాదవ్,సంతోష్,పీటర్,సోనూ,శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

### చేనేతల జీవితాల్లో వెలుగులు నింపాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రతినిధులు

మల్కాపురం: స్వదేశీ చేనేత రంగాన్ని అంతా ఆదరించి మన చేనేత రంగాన్ని ఉన్నత శిఖరంలో నిలపాలని మల్కాపురం సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల తెలుగు విభాగాధిపతి వి.లక్ష్మీదేవి అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సాధ్యమైనంత వరకు చేనేత వస్త్రాలు ధరించాలన్నారు. అంతా ఆదరిస్తే మన చేనేత రంగ కార్మికుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపిన వారమవుతామన్నారు. చేనేత కార్మికుల పని విధానంపై విద్యార్థులు ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమకుమారి, వై.అనసూయదేవి తదితరులు పాల్గొన్నారు.

### తల్లిపాలు బిడ్డకు అమృత తుల్యం



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ హిందుమతి

గోపాలపట్నం: తల్లి పాలు బిడ్డకు అమృతం వంటివని నరవ బెహరా నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ హిందుమతి అన్నారు. నరవ బెహరా నర్సింగ్ కళాశాల ప్రాంగణంలో సోమవారం తల్లి పాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బాలింతలు, గర్భిణులకు తల్లి పాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. తల్లి పాలు ఇవ్వడం వల్ల పిల్లల్లో వ్యాధి నిరోధిక శక్తి పెంపొందుతుందని తెలిపారు. తల్లికి కూడా వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అనూషా ప్రియ, దివ్యశ్రీ, అధ్యాపకులు షర్మిళ, నీరజ, రిచా గ్రేసి పాల్గొన్నారు.

### చిన్నారుల ఆరోగ్యమే ధ్యేయం

మల్కాపురం: పాఠశాలలకు వచ్చే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి జగనన్న గోరుముద్ద ద్వారా నాణ్యమైన భోజనం అందిస్తున్నారని 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ అన్నారు. జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. భోజనంలో నాణ్యతా లోపం లేకుండా పర్యవేక్షణ చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.



# గద్దర్‌కు ప్రజానాట్యమండలి ఘన నివాళి



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా నాట్యమండలి సభ్యులు

గోపాలపట్నం: ప్రజా గాయకుడు గద్దర్ మృతిపై ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ జిల్లా కార్యదర్శి చంటి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఎన్ఏడీ సమీపంలోని నేతాజీనగర్ హస్మీభవన్‌లో సోమవారం గద్దర్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. విప్లవ గాయకుడిగా, ప్రజా ఉద్యమంలో ఆయన పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించారన్నారు. ఆయన ఆకస్మిక మరణం తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు జి. రమణ, గౌరవ అధ్యక్షుడు దండు నాగేశ్వరరావు, సీనియర్ నాయకుడు అరుణ్ ., సహాయ కార్యదర్శి కె. సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు మౌలాలి, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ క్యాంపస్: ప్రజా గాయకుడు గద్దర్‌కు ఏయూ ఆచార్యులు, ఉద్యోగులు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం ఉదయం ఏయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.తాడిత, పీడిత ప్రజల పక్షాన నిలిచిన గద్దర్ గళం ప్రజల మధ్యలో ఎప్పుడూ సజీవంగా నిలుస్తుందన్నారు. ఆచార్య పి.అర్జున్, శ్రీనివాస్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

# వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్య



మృతురాలు గాయత్రీదేవి



ఫ్యాన్‌కు ఉరి వేసుకున్న దొడ్డి శ్రీను

మల్కాపురం: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. బాత్ రూమ్‌లో లుంగీ సాయంతో ఉరిపోసుకుని ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. దీనికి సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలు.. జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురం సమీపంలోని రామ్‌నగర్ ప్రాంతంలో జి.గాయత్రీదేవి ( 31 ) అనే మహిళ భర్త, ముగ్గురు పిల్లలు, అత్తతో కలిసి నివాసం ఉంటుంది. అయితే ఆమె భర్త ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లడంతో పిల్లలు,అత్తతో కలిసి ప్రస్తుతం ఉంటుంది. సోమవారం ఆమె తన గదిలోని బాత్ రూమ్‌లోకి వెళ్లి అక్కడ కిటికీ ఇనుప ఊసలకు లుంగీ సాయంతో ఉరి పోసుకుంది. బాత్‌రూమ్‌లోకి వెళ్లిన గాయత్రీదేవి ఎంతకూ రాకపోవడంతో అనుమానం వచ్చిన అత్త బాత్‌రూమ్ తలుపు తట్టి పిలవ సాగింది. అయినా పలకపోవడంతో కిటికీ నుంచి చూడగా ఆమె ఉరిపోసుకుని ఉన్నట్టు గుర్తించింది. వెంటనే కుటుంబ సభ్యులు,పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు ఆమె మృతిపై ఆరా తీశారు. అనుమానిత కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కాగా మృతురాలి భర్త మంగళవారం విశాఖ వస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కేసును సీఐ జి.డి. బాబు దర్యాప్తు చేస్తున్నారు.

**మనస్తాపంతో ..**

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు గవర వీధిలో ఓ వ్యక్తి మనస్తాపంతో బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు... గవరవీధి చివరి లైన్‌లో దొడ్డి శ్రీను(34) కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడు. భార్య అపర్ణ ఓ ప్లే స్కూల్‌లో పని చేస్తుంది. సోమవారం సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన ఆమె తలుపులు తెరిచి లోపలికి వెళ్లింది. పడక గదిలో దగ్గరగా వేసి ఉన్న తలుపులు తెరిచి చూసే సరికి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో వెంటనే స్థానికులతో పాటు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సమాచారం సేకరించారు. మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. అయితే పక్కవీధిలో ఉన్న సొంత ఇంటి నుంచి అపార్ట్‌మెంట్‌లోకి రెండు నెలల కిందట అద్దెకు వచ్చారు. మృతుడు శ్రీను డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మూడు రోజులుగా ఖాళీగా ఉంటున్నాడు. పనిలేక పోవడంతో పాటు కుటుంబంలో కలహాల వల్ల ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని అనుమానిస్తున్నారు. మధ్యాహ్నం 1 గంట వరకు వీధిలోనే తిరిగాడని స్థానికులు చెబుతున్నారు. మృతునికి తల్లి, భార్య, పాప ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఇద్దరు వ్యక్తులపై ఓ కుటుంబం దాడి

- తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స
- కేసు నమోదు చేసిన పోలీసులు




ఘటనా స్థలంలో గాయపడిన వెంకటరెడ్డి, భాస్కరరావు

గోపాలపట్నం: వెల్డింగ్ షాపు యజమానితో పాటు అతడి కుటుంబ సభ్యులు ఇద్దరి వ్యక్తులను పిలిపించి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన ఎన్ఏడీ సమీప గౌరీనగర్ రిక్షా కాలనీ వద్ద చోటు చేసుకుంది. ఎయిర్‌పోర్టు పోలీసులు.. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు... కోళ్ల గూడు తయారు చేయాలని మూడు నెలల కిందట వెల్డింగ్ షాప్ నిర్వాహకుడు రమణను కరాసాకు చెందిన వెంకటరెడ్డి, భాస్కరరావు కోరారు. నెలలు గడుస్తున్నా తయారు చేయక పోవడంతో ఆదివారం సాయంత్రం దుకాణం వద్దకు వెళ్లి యజమానికి కుమారుడు శివాజీని ఎప్పుడు ఇస్తారంటూ నిలదీశారు. కటింగ్ మిషన్ తీసుకెళ్లి పోతామని బెదిరించారు. అయితే తండ్రి రమణ వచ్చిన తర్వాత కొడుకులు జరిగిన విషయం చెప్పారు. దీంతో రాత్రి 10 గంటల సమయంలో వెంకటరెడ్డి, భాస్కర్‌కు ఫోన్ చేసి రావాలన్నాడు. వారు వచ్చి మిషన్ తీసుకెళ్లలేదని చెబుతున్నా దాడికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులైన రమణ ఆయన భార్య, పెద్ద కొడుకు గణేష్, రెండో కొడుకు సురేష్, చిన్న కొడుకు శివాజీ దాడికి పాల్పడ్డారు. పిడి గుద్దులు, కర్రలతో దాడి చేశారు. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు రాత్రి 10.30 గంటలకు ఘటనా స్థలానికి చేరుకుని గాయ పడిన వారిని కేజీహెచ్‌కు తరలించారు. దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకున్నారు. సీఐ బీఎండీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేపట్టారు.

# చదువుపై ఆసక్తి పెంచేలా బోధన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో-2 దివాకర్

గోపాలపట్నం: విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలిగేలా బోధన ఉండాలని ఎంఈవో-2 డి దివాకర్ అన్నారు. గోపాలపట్నం సమీపంలోని లక్ష్మీనగర్ ఈ బ్లాక్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. బోధన పద్ధతులు, వారి సామర్థ్యం గురించి విద్యార్థులతో మాట్లాడి పరిశీలించారు. పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సిలబస్ సకాలంలో పూర్తి చేయాలని.. వర్క్ బుక్‌లను పరిశీలించి దిద్దాలని సూచించారు. విద్యార్థుల్లో పఠనాశక్తి పెంపొందించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మెట్ట మోహనరావు, ఇతర పాధ్యాయులు పాల్గొన్నారు.

### చలో ఢిల్లీకి ఎన్ఏసీఎస్ అండ్ డబ్ల్యూ నాయకులు



విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కుతున్న యూనియన్ నాయకులు

గోపాలపట్నం: కొత్త పెన్షన్ స్కీమ్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నేషనల్ ట్రేడ్ యూనియన్ల పిలుపు తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి సోమవారం నేవల్ ఆర్మమెంట్ డిపో ఉద్యోగులు, యూనియన్ సభ్యులు బయలు దేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఎన్ఏసీఎస్అండ్ డబ్ల్యూ యూనియన్ ప్రధాన కార్యదర్శి సాలాపు మార్యయ్య మాట్లాడుతూ ఈ నెల 10న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టనున్నారని తెలిపారు. పాత పెన్షన్ స్కీమ్ సాధించేంత వరకు మా పోరాటం ఆపేది లేదన్నారు. పలువురు యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# కాలుష్య నియంత్రణ సామాజిక బాధ్యత



ఆటోలో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్న మేయర్ హరివెంకటకుమారి



బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి వస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణ అందరి సామాజిక బాధ్యతని మేయర్ గొలగాని హరివెంకటకుమారి పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా సోమవారం ఆమె తమ సొంత వాహనం వదలి క్యాంప్ ఆఫీస్ నుంచి ఆటోలో ప్రయాణించి జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి వచ్చారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో వాయు, శబ్ధ కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నగరంలో ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను వారి సిబ్బందితో ఉపయోగించేలా చూడాలన్నారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలను ఉపయోగించాలని మేయర్, కమిషనర్ సూచించారు.

### నిరుద్యోగుల సమస్యలపై 11న రౌండ్ టేబుల్ సమావేశం

ఎంవీపీ కాలనీ: ఈ నెల 11న నిరుద్యోగుల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మర్రి వేముల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఎంవీపీ కాలనీలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన అవసరముందన్నారు. ఉద్యోగ ప్రకటనలు, నిరుద్యోగల సమస్యలపై విద్యావేత్తలు, మేధావులతో ఈ నెల 11న పబ్లిక్ లైబ్రరీ వేదికగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు బొర్రా రమణ, విజయనగరం జిల్లా అధ్యక్షుడు కేఎస్ఆర్, తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ కిషోర్‌కుమార్, కరణంరెడ్డి

పెదగంట్యాడ: ఆంధ్ర షోటోకాన్ కరాటే డు అసోసియేషన్ ప్రతినిధులు పోలరాజు, సునీల్ ఆధ్వర్యంలో బీసీ రోడ్డులోని అగ్నికుల క్షత్రియ కల్యాణమండపంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి మొత్తం 600 మంది పాల్గొన్నారు. విశాఖ జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, శ్రీకాకుళం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. కాకినాడ జట్టు మూడో స్థానాన్ని సాధించారు. విజేతలకు సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ కిషోర్‌కుమార్, బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో బాలకృష్ణ, వెంకటేశ్వరరావు, తాతారావు, శ్రీనివాసరావు, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 13 నుంచి ప్రతిభా పోటీలు

దాబాగార్డెన్స్: దేశ 76వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 13 నుంచి 15 వరకు ప్రతిభా పోటీలు నిర్వహించనున్నట్టు మిరాకిల్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు మహ్మద్ షకీల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ఐయామ్ యాన్ ఇండియన్-ఐ లవ్ మై ఇండియా' పేరిట ద్వారకానగర్ పౌర గ్రంథాలయం వేదికగా మూడు రోజుల పాటు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 7.30 గంటల వరకు పోటీలు ఉంటాయన్నారు. క్లాసికల్, ఫోక్, వెస్ట్రన్ డ్యాన్స్, సింగింగ్, గెటప్స్, డ్రాయింగ్ పోటీలు, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, ట్రెడిషనల్ అండ్ ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. పోటీలో పాల్గొనే ప్రతి ఒక్కరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌తోపాటు మెమెంటో అందజేయనున్నట్టు తెలిపారు. వివరాలకు 99664 85335 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## 'ఉక్కు ఉత్పత్తికి ఆటంకం సరికాదు'



దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ఉత్పత్తిపరంగా ఆటంకాలను సృష్టించడం సరికాదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్మిక శక్తిని అణగదొక్కే విధానాలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలని హెచ్చరించారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో 907వ రోజు సోమవారం ఆర్ఎంహెచ్‌పీ, ఆర్‌ఈడీ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ముందుగా ప్రజా గాయకుడు గద్దర్ మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గద్దర్ స్ఫూర్తితో ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు యు.రామస్వామి, నీరుకొండ రామచంద్రరావు, ఆర్ఎంహెచ్‌పీ, ఆర్‌ఈడీ విభాగ ప్రతినిధులు శ్రీనివాస్, బి.ఎన్.రాజు, జయ, బొట్టు శ్రీను, పట్టా రమేష్, కార్మికులు పాల్గొన్నారు

## మహా సభల విజయవంతానికి ప్రచారం



యాత్ర చేపట్టిన ఏఐటీయూసీ నాయకులు

మల్కాపురం: నగరంలో ఈ నెల 12,13వ తేదీల్లో నిర్వహించనున్న ఏఐటీయూసీ 13వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆ యూనియన్ నాయకులు సోమవారం ప్రచార యాత్ర చేపట్టారు. దీనిలో భాగంగా హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు , ఐవోసీ గేటు వద్ద నిర్వహించిన కార్యక్రమాల్లో ఏఐటీయూసీ జిల్లా నాయకుడు కె.సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలనతో ప్రజలు విసుగు చెందుతున్నారన్నారు.వీరి ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సభను నిర్వహిస్తున్నట్టు వివరించారు. లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడితే చూస్తూ ఉరుకోబోమని హెచ్చరించారు. స్థానిక పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగులకు అధిక అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.13న నగరంలో జరగే మహాసభను కార్మికులంతా విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సత్తిబాబు,అప్పలరెడ్డి,తిరుపతి,చిరంజీవి, శివ, ఈశ్వరర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎకో వైజాగ్ కిడ్స్ ఆర్ట్స్ కాంటెస్ట్ విజేతలకు బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధిలోని ఏకేసీకాలనీ, షిప్‌యార్డ్‌కాలనీ, జీవీ నిలయం తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన ఎకో వైజాగ్ కిడ్స్ ఆర్ట్స్ కాంటెస్ట్ విజేతలకు సోమవారం వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి కులవృత్తులకు సహాయసహకారాలు అందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులను అనేక రకాలుగా ఆదుకుంటుందని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రతి ఒక్కరు రెండేసి మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలన్నారు.

**విద్యకు పెద్దపీట**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేశారన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. డిజిటల్ విద్యను పేద విద్యార్థులకు చేరువ చేశారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 వెంకటరావు, ఎడ్యుకేషన్ సెక్రటరీ సోయిల్, జీవీఎంసీ హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు, జీవీఎంసీ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం భారతి, జీవీ నిలయం హెచ్ఎం శ్రీదేవి, , గృహసారథులు, సురేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్-మర్రిపాలెం మధ్య కోచింగ్ డిపో సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కన గుర్తు తెలియని ఒక వ్యక్తి మరణించాడు. విశాఖ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. కోచింగ్ డిపో సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. ఇతడి వయసు సుమారు 35-40 సంవత్సరాలు. ఎత్తు సుమారు 5.6 అడుగులు. శరీరం కుళ్లిపోయి నల్లగా మారడంతో గుర్తించడానికి కూడా వీలులేకుండా ఉంది. ఇతను (అడిడాస్ పేరు గల) నలుపు రంగు ఫుల్ లోయర్, తెలుపు, నలుపు, పచ్చని రంగుల గీతలు గల టీ షర్ట్ ధరించి ఉన్నాడు. జీఆర్పీ సీఐ కోటేశ్వరరావు ఆదేశాలతో ఎస్ఐ బాలాజీరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ఆచూకీ తెలిసిన వారు విశాఖ రైల్వే స్టేషన్‌లోని గవర్నమెంట్ రైల్వే పోలీసులకు స్వయంగా గానీ లేదా 96661 22722, 94406 27547 నంబర్లలో గానీ తెలియజేయాలని ఎస్ఐ బాలాజీరావు కోరారు.

## ఆరోగ్య మిత్రల సేవలు అభినందనీయం



ఆరోగ్య మిత్ర చిప్పాడ దీప్తికి ప్రశంసాపత్రం అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం లబ్ధిదారులకు ఉత్తమ సేవలు అందించిన ఆరోగ్య మిత్రల సేవలు అభినందనీయమని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో ఉత్తమ సేవలందించిన ఆరోగ్య మిత్రలకు సేవా ఆరోగ్య మిత్రగా గుర్తించి ప్రశంసాపత్రాలను ఆయన అందజేశారు. ప్రతి నెలా ఒక్కరిని ఎంపిక చేసి ప్రశంసాపత్రంతోపాటు నగదు పురస్కారం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. జూన్ నెలకు గానూ గీతం ఆస్పత్రిలో పని చేస్తున్న ఆరోగ్య మిత్ర చిప్పాడ దీప్తికి ప్రశంసాపత్రంతోపాటు రూ.5 వేల నగదు పురస్కారాన్ని అందించారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ కె.వి.వి.ఎస్.ఎన్.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


## 'ప్రజల భాష తెలుగు'



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న ఆచార్య అరుణ

ఏయూ క్యాంపస్: ప్రజలు ఆదరించి, పరిరక్షించిన భాష తెలుగు అని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం భాషాశాస్త్ర శాఖాధ్యక్షురాలు ఆచార్య గంజి అరుణ అన్నారు. సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విద్యార్థులనుద్దేశించి ప్రపంచీకరణ నేపథ్యంలో తెలుగు భాష అంశంపై ప్రసంగించారు. గతంలో ఆంధ్రదేశాన్ని పాలించిన రాజులు అధికార భాషగా సంస్కృతాన్ని, ప్రాకృతాన్ని అమలు చేశారని, తెలుగును ప్రజలు ఆదరించడంతో నేటికీ మనుగడ సాగిస్తోందన్నారు. ప్రజల ఇష్టాన్ని తెలుసుకున్న రాజులు తరువాతి కాలంలో తెలుగులోనే రాజ్యపాలన చేశారని గుర్తుచేశారు. తరువాతి కాలంలో కావ్యాల్లో గ్రాంధిక భాష కొన్ని సంవత్సరాలు రాజ్యమేలిందని, పండిత భాషతో పాటు పామర భాషకు సైతం సమ ప్రాధాన్యత లభించిందని వివరించారు. తెలుగు భాషపై పాశ్చాత్య నాగరికతల ప్రభావం, ఆధునిక సాంకేతికత పరిజ్ఞానంతో భాషలో అనేక అసమానతలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్రాంతీయ వైవిధ్యతో అనేక మార్పులు చేర్పులు వచ్చాయని, భాష పరిణామం చెందుతున్న విధానం వివరించారు. ప్రపంచీకరణ నేపథ్యంలో తెలుగు భాష పద సంపదను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగ ఆచార్యులు డాక్టర్ సీతారత్నం, డాక్టర్ ఈశ్వరమ్మ, డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ రత్నశేఖర్, డాక్టర్ లావణ్య, డాక్టర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## మరిన్ని ముద్ర రుణాలు మంజూరు చేయాలి



కేఎస్ సుధాకరరావును సత్కరిస్తున్న కర్రి వేణుమాధవ్

బీచ్ రోడ్డు: రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం ద్వారా బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రూ.130 కోట్లు ముద్ర రుణాలు మంజూరయ్యాయని సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ తెలిపారు. ఈ మేరకు రుణాలు మంజూరు చేసినందుకు కృతజ్ఞతగా బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ కేఎస్ సుధాకరరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ, అమరావతి, రాజమండ్రి జోన్లలో మరిన్ని ముద్ర రుణాలు స్వర్ణకారులకు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై సుధాకరరావు స్పందిస్తూ ఇప్పటికే 23 పట్టణాల్లో ముద్ర రుణాల ప్రక్రియ ప్రారంభించామని, భవిష్యత్తులో మరిన్ని పట్టణాల్లో ప్రారంభించి స్థానిక స్వర్ణకారు సంఘాలకు రుణాలు అందజేస్తామని హామీ ఇచ్చారు.